# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు — తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY



## విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..

మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954



Cerculated by Hyderbad, Nalgonda, Nizambad, Warngall, Khammam, Rangareddy, Kamareddy, Medak, Adilabad,Manchiryal, KarimNagar

పబ్లిషర్: తెలంగాణ    సంపుటి : 1    సంచిక : 12 బుధవారం 21- 8-2024    పేజీలు : 4    వెల రూ.- 3




## హైడ్రాలో అధికారులపై చర్యలు తీసుకోరా

- సామాన్యులనే బలిపశువులను చేస్తే సహించం
- అవసరమైతే మరో తెలంగాణ ఉద్యమం మొదలు పెడతాం
- కామారెడ్డి బిజెపి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి హెచ్చరిక

హైదరాబాద్,ఆగస్ట్20 **మనవెలుగు**

హైడ్రా ఆలోచన బాగున్నా.. ఆచరణలో అది సాధ్యం కావడం లేదని భాజపా ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. హైడ్రా వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దీనికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోకుండా సామాన్యులపై పడడం సరికాదన్నారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైడ్రాతో మరో తెలంగాణ ఉద్యమం మొదలు పెడతామని మెచ్చరించారు.

### రాజీవ్ విగ్రహం ఏర్పాటుపై దుమారం

### సచివాలయం ముందు ఏర్పాటుకు నిర్ణయం

### తీవ్రగా తప్పుపట్టిన బిఆర్ఎస్ నేత కెటిఆర్

### పెట్టి తీరుతాం..టచ్ చేస్తే అంతేనంటూ సిఎం రేవంత్ హెచ్చరిక

### రాజీవ్ జయంతి వేడుకల్లో బిఆర్ఎస్‌పై ఘాటు విమర్శలు

ప్రస్తుతం తెలంగాణలో విగ్రహాల వార్ నడుస్తోంది. విగ్రహాలకు సంబంధించి అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీ మధ్య పెద్ద యుద్ధమే నడుస్తోంది. :సచివాలయం ముందు రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టాలన్న అధికార కాంగ్రెస్ తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయంలో విపక్ష బిఆర్ఎస్ గట్టిగానే విమర్శలు చేస్తోంది. సమస్యలను పక్కదారి పట్టించే డ్రామాలంటూ బిజెపి మరోవైపు ఎదురుదాడికి తెగించింది. తాము అధికారంలెకి వస్తే సెక్రటేరియట్ ముందు రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఘాటు వ్యాఖ్యలు పెనుదుమా రాన్ని రేపుతున్నాయి.



# పెట్టి తీరుతాం.. టచ్ చేస్తే అంతే

వివరాలు 2లో

## రైతురుణ మాఫీపై దొంగ లెక్కలు

- మంత్రి ఉత్తమ్ సమాధానమే దీనికి జవాబు
- రాజీవ్ విగ్రహం పెట్టడం దారుణం
- మేం వచ్చాక తొలగిస్తామన్న జగదీశ్ రెడ్డి



2లో

## హైదరాబాద్‌లో మరోసారి భారీ వర్షం..

# అప్రమత్తమైన జీహెచ్ఎంసీ

హైదరాబాద్:**మనవెలుగు**

నగరంలో మరోసారి భారీ వర్షం కురుస్తోంది. మంగళవారం సాయంత్రం పంజాగుట్ట, బేగంపేట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో కురుస్తోన్న వర్షానికి రహదారులు జలమయమయ్యాయి.పలు చోట్ల ట్రాఫిక్ స్తంభించడంతో నగర వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీహెచ్ఎంసీ యంత్రాంగం, డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తమయ్యాయి. నిన్నటి వర్షానికే ఇంకా నగర వాసులు కోలుకోలేదు. మళ్లీ వర్షం కురుస్తుండటంతో ప్రజలు వణికిపోతున్నారు.



## జగన్ అక్రమాస్తుల కేసు విచారణ

### సెప్టెంబర్ 17కు వాయిదా వేసిన హైకోర్టు



2లో

## ఎన్నికలకు ముందు కీలక నిర్ణయం

### కొత్త ఇమ్మిగ్రేషన్ కార్యక్రమానికి బైడెన్ శ్రీకారం



వాషింగ్టన్,ఆగస్ట్20 **మనవెలుగు**

అమెరికన్ సిటిజన్ షిప్ గల వారి ఇమ్మిగ్రెంట్ల జీవిత భాగస్వాములకు సిటిజన్ షిప్ కార్యక్రమాన్ని అధ్యక్షు డు జో బైడెన్ ప్రారంభించారు. చట్ట విరుద్ధంగా అమెరికాలోకి వచ్చి దీర్ఘకాలంగా పౌరసత్వం కోసం ఎదురు చూస్తున్న వారి కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. వచ్చే నవంబర్ ఐదో తేదీన దేశాధ్యక్ష ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో కొత్త ఇమ్మిగ్రేషన్ చట్టం అమలు చేయడం ప్రాధాన్యం సంతరిం చుకున్నది. ఈ చట్టంతో అమెరికా పౌరసత్వం గల భార్యతోపాటు ఇద్దరు పిల్లలతో జీవిస్తున్న మిగౌల్ అలెమన్ అనే ఉబెర్ డ్రైవర్ (39)కి అమెరికా పౌరసత్వం లభిస్తుంది. నాలుగేండ్ల వయస్సులోనే అలెమన్.. మెక్సికో నుంచి అమెరికాకు వచ్చాడు. మెక్సికోతోపాటు, ఎల్ సాల్వడార్,.ఇటువంటి వారు అమెరికాలో లక్షల మంది అమెరికా పౌరసత్వం కోసం ఎదురు చూస్తున్నారు.

## రుణమాఫీ అందని రైతులను గుర్తించండి

- వారికి అండగా నిలబడి అధికారులకు తెలపండి
- సమాచారం తెలియచేసి నిలదీయండి
- బిఆర్ఎస్ శ్రేణులకు మాజీమంత్రి వేముల పిలుపు

నిజామాబాద్,ఆగస్ట్20 **మనవెలుగు** గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికా రులకు దరఖాస్తు చేసుకునే రుణమాఫీ కాలేని రైతులకు నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు ఎక్కడికక్కడ అండగా నిలవాలని, వారికి కావాల్సిన సహాయ సహకారాలు అందించాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పిలుపు నిచ్చారు. నేరుగా రైతులను గుర్తించి వారి వివరాలను అధికారుల దృష్టికి తేవాలని అన్నారు. దరఖాస్తు చేసు కునే రైతులకు ఏదైనా ఇబ్బందులు ఏర్పడితే స్థానికంగా ఉండే బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను



మన వెలుగు
ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక
బుధవారం 21 ఆగస్టు 2024

# రైతురుణ మాఫీపై దొంగ లెక్కలు

హైదరాబాద్,ఆగస్టు 20 కాంగ్రెస్ పాలనపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి ఫైర్ అయ్యారు. రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పగటి దొంగలా దొరికిందని ఆరోపించారు. మంగళ వారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో ఆ పార్టీ విధానాలపై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..17 లక్షల 13 వేల మందికి రుణ మాఫీ చేయలేదని స్వయంగా మంత్రి ఉత్తమ్ ఒప్పుకున్నారు. రూ.31 వేల కోట్లు పూర్తిగా చేయటానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.ఇది ఏ తేదీలోపు చేస్తారో స్పష్టంగా హామీ ఇవ్వాలన్నారు. సీఎం రుణ మాఫీ పూర్తయిందని డ్యాన్సులు చేస్తు న్నారు. మంత్రులు మరోలా మాట్లాడుతున్నారని విమర్శించారు. సీఎం చెప్పింది అబద్ధమని ఉత్తమ్ మాటలతో అర్థమవుతున్నది. ఇప్పుడు రేవంత్ రెడ్డి ముక్కు నేలకు రాసి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తావా? చెంపలు వేసుకుంటావా? అని సూటిగా ప్రశ్నించారు. ప్రతిపక్షంగా ఇంకా మేము పని మొదలు పెట్టలేదు. ముందు ముందు మా తడఖా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. ల్గ÷తులు ఆందోళన చేస్తే భయపెట్టిస్తారు. పోలీస్ స్టేషన్‌లో పెడతారు. మీరు ఎన్ని కుట్రలు చేసినా బీఆర్ఎస్ మాత్రం రైతులకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలన్న మా డిమాండ్ పై సీఎం రేవంత్ తెలివి లేకుండా మాట్లాడుతున్నారు. తెలంగాణ సోయి, ఆత్మ లేని వ్యక్తులు సచివాలయంలో ఉండటం ఖర్మ అని ప్రజలు అనుకుంటున్నారు. ఖచ్చితంగా మేము అధికారం లోకి రాగానే రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామన్నారు. రాజీవ్ విగ్రహాన్ని గాంధీ భవన్‌లో లేదంటే రేవంత్ తన ఇంట్లోనో పెట్టుకోవాలని సూచించారు. సీఎం పదవిలో ఉండి తెలంగాణ తల్లిపై చిల్లర మాటలు మాట్లాడుతున్నాడు. రాజీవ్ గాంధీకి తెలంగాణకు ఏం సంబంధమని ప్రశ్నించారు. రాజీవ్ గాంధీ నోటి నుంచి ఒక్కసారైనా తెలంగాణ పదం ఉచ్ఛరించారా? ఆయన ప్రధానిగా ఉన్నప్పుడు తెలంగాణకు ఏమి ఇచ్చారని నిలదీశారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయం ముందు పెట్టాలని ప్రొఫెసర్ హరగోపాల్ రాహుల్ గాంధీకి లేఖ రాశారు. తెలంగాణ తల్లి విగ్రహంపై కోదండ రామ్ స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యేలు పైళ్లా శేఖర్ రెడ్డి, గాదరి కిశోర్ కుమార్, బీఆర్ఎస్ నేత మన్నె గోవర్ధన్ రెడ్డి, ఒంటెద్దు నరసింహా రెడ్డి ఉన్నారు.

## హైడ్రాలో అధికారులపై చర్యలు తీసుకోరా

భూమి కొనుగోలు చేసినప్పుడు చాలా మందికి అది ఏ పరిధిలోనిది అనేది తెలియదు. హెచ్ఎండీఏ పరిధిలో భూమి ఉందా? అనుమతులున్నాయా? లోన్ వస్తుందా? అనేది మాత్రమే ప్రజలు చూస్తారు. రియల్టర్లకు అనుమతులు ఎవరిచ్చారు?లేఔట్ వేసేందుకు పర్మిషన్లు ఇచ్చిందెవరు? ప్రభుత్వ అనుమతులతోనే ప్రజలు గతంలో భూములు, ప్లాట్లు కొన్నారు. బఫర్ జోన్లు, చెరువులు, శిఖం భూములని తెలియకుండా, ప్రభుత్వ అనుమతులు లేకుండానే రియల్టర్ల చేతుల్లోకి వెళ్లాయా? ప్రభుత్వానికి తెలియకుండానే ఎఫ్‌టీఎల్ ప్రకారం డాక్యుమెంట్లు ఎలా తయారయ్యాయి? అనుమతి లేకుండానే లేఔట్లు ఎలా అయ్యాయి?ఇళ్ల నిర్మాణంతో పాటు ప్లాట్లు ఎలా అమ్ముడయ్యాయి? దానికి బాధ్యులెవరు? అనుమతి ఇచ్చిన జీహెచ్ఎంసీది తప్పా? కమిషనర్లది తప్పా?బఫర్ జోన్లు, చెరువులు, శిఖం భూములని తెలిసి అనుమతులు ఎలా ఇచ్చారన్నది తెలపాలని అన్నారు. బాధ్యులైన అధికారులపై సీఎం రేవంత్‌రెడ్డి, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌లు ఏ విధమైన చర్యలు తీసుకుంటారో చెప్పాలి. చెరువులు, బఫర్ జోన్లు, శిఖం భూములంటూ ఏ ప్రాతిపదికన ఇళ్లు కూలుస్తున్నారు? గతంలో అనుమతులు ఇచ్చిన అధికారులను వదిలేసి.. సామాన్యులపై పడటం ప్రజాపాలన అవుతుందా?ఇష్టారీతిన డాక్యుమెంట్లు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసిన అధికారులపై చర్యలు ఉండవా అని ప్రశ్నించారు. ప్రభుత్వాలు మారుతున్నా.. ప్రజల తలరాతలు మారడం లేదు. హైడ్రా కొత్తగా సాధించిందేమీ లేదు.. సామాన్యుల బతుకులు కూల్చడం తప్ప. హైడ్రాపై మరో తెలంగాణ ఉద్యమం మొదలు పెడతాం అని వెంకటరమణారెడ్డి అన్నారు.

### హైకోర్టుకు చేరిన జోతిష్యుడు

## వేణుస్వామి పంచాయితీ..




హైదరాబాద్: ప్రముఖ జోతిష్యుడు వేణుస్వామి వివాదం తెలంగాణ హైకోర్టుకు చేరింది. ఇటీవల నటుడు అక్కనేని నాగచైతన్య, శోభితా ధూళిపాళ్ల నిశ్చితార్థంపై ఆయన చేసిన వ్యాఖ్యలకు గాను మహిళా కమిషన్ నోటీసులు ఇచ్చింది.తనకు నోటీసులు ఇవ్వడాన్ని హైకోర్టులో వేణుస్వామి సవాల్ చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన హైకోర్టు.. స్వామికి నోటీసులు ఇవ్వడానికి ఎలాంటి అర్హత ఉందని మహిళా కమిషన్‌ను ప్రశ్నించింది. అతను జ్యోతిష్యాల పేరుతో అసత్య, మోసపూరిత వ్యాఖ్యలు చేస్తున్నాడంటూ పబ్లిక్ ప్రాసిక్యూటర్ హైకోర్టుకు తెలిపారు. ఇరువర్గాల వాదనలు విన్న హైకోర్టు తదుపరి విచారణను రేపటికి(బుధవారం) వాయిదా వేసింది.

అసలేం జరిగిందంటే?

జ్యోతిష్యుడు వేణుస్వామి ప్రముఖులపై వ్యాఖ్యలు చేస్తూ తరచూ వార్తలో నిలుస్తుంటారు. గతంలోనూ ఆయన అనేక మంది సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై మాట్లాడారు. నాగచైతన్య, సమంత వివాహ సమయంలోనూ వారు త్వరలో విడిపోతారంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. అలాగే కొణిదల ఉపాసన, యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ సహా అనేక మంది గురించి ఆయన తీవ్రంగా మాట్లాడారు.

దీనిపై ఆయా హీరో, హీరోయిన్ల ఫ్యాన్స్ అతనిపై నిప్పులు చెరిగారు.

# పెట్టి తీరుతాం..టచ్ చేస్తే అంతే



హైదరాబాద్,ఆగస్టు 20రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా సోమాజీగూడలో రాజీవ్ విగ్రహానికి సీఎం నివాళులర్పించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. కేటీఆర్‌పై విరుచుకుపడ్డారు. ఎవడికైనా చేతనైతే రాజీవ్ గాంధీ విగ్రహం ముట్టుకోండి. రాజీవ్ విగ్రహాన్ని ముడితే చెప్పు తెగే దాకా కొడుతాం. రాజీవ్ విగ్రహం ఎవరు ముడుతారో, ఎప్పుడు ముడుతారో చెపితే మా జగ్గారెడ్డిని పంపిస్తాం. తాగుబోతులు, దొంగల విగ్రహాలకు సచివాలయం ముందు స్థానం లేదు. తొందరలోనే రాజీవ్ విగ్రహాన్ని ఆవిష్కరించు కుందాం. పండగ వాతావరణంలో రాజీవ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుందాం. రాజీవ్ విగ్రహాన్ని పెడతామంటే తొలగిస్తామని కొందరు సన్నాసులు అంటున్నారు. అధికారం పోయినా బలుపు తగ్గలేదు. బలుపును తగ్గించే బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలు తీసుకుంటారు. వాళ్ల అయ్య విగ్రహం పెట్టుకోవాలని కేటీఆర్ అనుకుం టున్నాడు. వాళ్ల అయ్య పోయేదెప్పుడు? విగ్రహాన్ని పెట్టేదెప్పుడు. ఉద్యమం ముసుగులో తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకొన్నారు. తాగుబోతు సన్నాసి విగ్రహం సెక్రటేరియట్ ముందు పెడుతారా?. తెలంగాణను దోచుకున్న దొంగ విగ్రహం పెట్టాలా అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. పొద్దున లేస్తే తాగేవాడి విగ్రహాన్ని సెక్రటేరియట్ ముందు పెడుతారా? నీ అయ్య విగ్రహం కోసం రాజీవ్ విగ్రహాన్ని తొలగించాలని అంటావా?. అధికారంలోకి వస్తే అని మాట్లాడుతున్నాడు... బిడ్డా.. మీకు అధికారం ఇక కలనే.. ఇక మీరు చింతమడకకే పరిమితం. పదేళ్లు తెలంగాణ తల్లి విగ్రహం పెట్టని వాళ్లు ఇప్పుడు తెలంగాణ తల్లి విగ్రహం గురించి మాట్లాడుతున్నారు. డిసెంబర్ 9న సచివాలయం లోపల తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసే బాధ్యత మాది. మా చిత్తశుద్ధిని ఏ సన్నాసి శంకించనవసరం లేదు. విచక్షణ కోల్పోయి అర్థంపర్థం లేని మాటలు మాట్లాడితే తెలంగాణ సమాజం మిమ్మల్ని సామాజిక బహిష్కరణ చేస్తుంది. కలలో కూడా నీకు అధికారం రాదు. పది సంవత్సరాల్లో తెలంగాణ తల్లి విగ్రహం గుర్తు రాలేదా? బీఆర్ఎస్ నాయకులు ఇష్టమున్నట్టు మాట్లాడితే సామాజిక బహిష్కరణ చేస్తాం. డిసెంబర్ 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం పెడతాం అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.



దేశంలో విప్లవాత్మక మార్పులకు మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ శ్రీకారం చుట్టారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దేశానికి టెక్నాలజీని పరిచయం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు. పంచాయతీ రాజ్ వ్యవస్థలు ఆయన హయాంలోనే బలోపేతం అయ్యాయని తెలిపారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తదితరులు ఘనంగా నివాళులు అర్పించారు. పంజాగుట్టలోని రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా భారాస నేతలపై సీఎం మండిపడ్డారు. అధికారం పోయినా.. వారికి అహంకారం తగ్గలేదని విమర్శించారు. రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామని అంటున్నారని.. అనవసర ఆరోపణలు చేస్తే భారాస నేతలను తెలంగాణ సమాజం బహిష్కరిస్తుందని హెచ్చరించారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని రాష్ట్రంలో ప్రారంభిస్తామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను యంగ్ ఇండియా రెసిడెన్షియల్ అకాడమీలుగా మారుస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వి.హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే తెలంగాణ సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి ధ్వజమెత్తారు. తాము అధికారంలోకి వచ్చిన తొలిరోజే బాబాసాహెబ్ అంబేద్కర్ సచివాలయం పరిసరాల్లోని చెత్తను తొలగిస్తా మని విమర్శించారు. నా మాటలు గుర్తుపెట్టుకో చీఫ్ మినిస్టర్ అని రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. నీలాంటి ఢిల్లీ గులాములు తెలంగాణ ఆత్మగౌరవాన్ని, తెలంగాణ ఖ్యాతిని అర్థం చేసుకోలేరని సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ వ్యాఖ్యానించారు. చిన్న పిల్లల ముందు చెత్త మాటలు మాట్లాడిన రేవంత్ రెడ్డి నైజం, వ్యక్తిత్వం ఆయన పెంపకాన్ని సూచిస్తుందని అన్నారు. మానసిక రుగ్మత నుంచి రేవంత్ రెడ్డి త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని పరిస్థితులు ఎలా ఉన్నాయో వివరించేందుకు ఇవే తార్కాణాలు అని ట్విట్టర్ వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రెండు ఫొటోలను కూడా ఆయన షేర్ చేశారు. నిజామాబాద్‌లో పోలీసుల వేధింపులతో విసుగుచెందిన ఓ స్వీట్ షాపు యజమాని తన దుకాణాన్ని మూసివేస్తూ ఒక బ్యానర్ పెట్టారని తెలిపారు. ఒకవైపు ఇలా నిజామాబాద్‌లో చిన్న వ్యాపారులను వేధించడంలో బిజీగా ఉంటే.. మరోవైపు వరంగల్‌లోని రద్దీ రహదారిపై నిర్వహించిన కాంగ్రెస్ మంత్రి కొండా సురేఖ పుట్టిన రోజు వేడుకల్లో ఏసీపీ పాల్గొన్నారని వెల్లడించారు. ఈ వేడుకల్లో క్రాకర్స్ కాల్చడం వల్ల అమాయకులు గాయపడ్డారని మండిపడ్డారు.

## రుణమాఫీ చేస్తే.. రైతులు ఎందుకు ఆందోళన చేస్తారు?:



సిద్దిపేట: రైతు రుణమాఫీపై కాంగ్రెస్ నేతలు రోజుకో తీరున మాట్లాడుతున్నారని భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రూ.31వేల కోట్ల రుణమాఫీ జరిగిందని చెప్పారు, సీఎం సమక్షంలోనే భట్టి అసత్యాలు చెప్పారని విమర్శించారు.మంగళవారం సిద్దిపేటలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రుణమాఫీ కాకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా రైతులంతా ఆందోళన చేస్తున్నారని చెప్పారు. సీఎం, మంత్రులు ఇష్టానుసారం మాట్లాడి గందరగోళం సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు. రుణమాఫీ జరిగితే రైతులు ఎందుకు ఆందోళన చేస్తారని ప్రశ్నించారు. రుణమాఫీపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన పోచారం, గుత్తా అమిత్‌లకు కీలక పదవులు




హైదరాబాద్: బీఆర్ఎస్‌కు గుడ్ బై కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న ఒక్కొక్కరికి ప్రాధాన్యత కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే పార్టీ కండువా కప్పుకున్న నేతలకు పదవులు ఇవ్వగా..తాజాగా ఒక యంగ్ లీడర్‌కు, మరో సీనియర్ నేతకు కీలక పదవులు ఇస్తూ రేవంత్ సర్కార్ జీవోలు ఇవ్వడం జరిగింది.

## జగన్ అక్రమాస్తుల కేసు విచారణ

హైదరాబాద్,ఆగస్ట్2 మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసుల విచారణ మరోసారి వాయిదా పడింది. జగన్ అక్రమాస్తుల కేసుల విచారణను వేగవంతం చేయాలన్న పిల్‌పై తెలంగాణ హైకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. జగన్ కేసులప త్వరితగతిన విచారణ జరపాలని హరిరామ జోగయ్య పిల్ దాఖలు చేశారు. ఇప్పటికే జగన్‌తో పాటు సీబీఐకి తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ప్రజాప్రతినిధుల కేసులను త్వరితగతిన జరపాలని సుప్రీంకోర్టు ఆదేశాలున్నాయని పిటిషనర్ వాదించారు. ఈ క్రమంలో పిటిషన్లపై విచారణను సెప్టెంబర్ 17కు తెలంగాణ హైకోర్టు వాయిదా వేసింది.మరోవైపు ఏపీ మాజీ సీఎం జగన్ అక్రమాస్తుల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసు విచారణ నుంచి జస్టిస్ సంజయ్ కుమార్ తప్పుకొంటున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే.. జగన్ అక్రమాస్తుల కేసులకు సంబంధించి నమోదైన సీబీఐ కేసుల్లో తీర్పు వెలువడిన తర్వాతే ఈడీ కేసుల్లో తీర్పులు ఇవ్వాలని గతంలో తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. సీబీఐ, ఈడీ కేసులను విడివిడిగా లేదా సమాంతరంగా విచారించినా ఆ పద్ధతినే అనుసరించాలని అప్పట్లో స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పును గతేడాది మే నెలలో ఈడీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆగస్టు 14న ఈడీ పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే.. కేసు ప్రారంభమైన వెంటనే తాను విచారణ నుంచి తప్పుకొంటున్నానని జస్టిస్ సంజయ్ కుమార్ స్పష్టం చేశారు.

## రుణమాఫీ అందని రైతులను గుర్తించండి

(మొదటి పేజి (తరువాయి)

సంప్రదించాలని రైతులకు సూచించారు. రుణం తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ అయ్యేవరకు బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాడుతుందని ఆయన పునరుద్ఘాటించారు. ఇకపోతే కాంగ్రెస్ పార్టీ తొమ్మిది నెలల క్రితం బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిందని ఎమ్మెల్యే వేముల అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఒకటి రైతులకు ఆగస్టు 15వ తేదీ వరకు పూర్తిగా రుణమాఫీ చేస్తామని చెప్పారని, రాష్ట్రంలో ఏ జిల్లాకు వెళ్లినా.. ఆ జిల్లాలోని ప్రముఖ దేవాలయాల మీద ఒట్టు వేసి పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు వేయించుకొని హామీని మరిచిపోయారని అన్నారు. వందశాతం రుణమాఫీ చేస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు.. సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరితే క్యాంపు కార్యాలయంపై గుండాలను పంపించి దౌర్జన్యం చేయించారని మండిపడ్డారు. దానికి పోలీసులు వత్తాసు పలకడం సిగ్గుచేటని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో శాంతి భద్రతలు దిగజారి పోయాయని అన్నారు. రాష్ట్రంలోని ఏ జిల్లాకు వెళ్లినా హత్యలు, మహిళలపై అఘాయిత్యాలు, దొంగతనాలు పెరిగిపోయాయని అన్నారు. సిద్దిపేటలో అర్ధరాత్రి జరిగిన సంఘటనలను తీవ్రంగా ఖండిస్తున్నామని, బీఆర్ఎస్ నాయకులను భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తే ఊరుకునేది లేదని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన రుణమాఫీ హామీని వంద శాతం అమలు చేసేలా బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన నిలుస్తుందని అన్నారు.

ఏ గ్రామానికి వెళ్లినా 30 నుంచి 40 శాతం వరకు కూడా రుణమాఫీ కాలేదని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే భేషరతుగా రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో ఏ సీఎం ప్రవేశపెట్టని రైతుబంధును కేసీఆర్ ప్రవేశపెడితే.. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రైతుబంధు పడలేదని అన్నారు. దేశంలో అతి తక్కువ కాలంలోనే సీఎం దిష్టిబొమ్మను దహనం చేసే వరకు దిగజారిన ఏకైక వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి అని అన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మల శవయాత్ర చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా రైతులకు రుణమాఫీ చేయాలని వేముల డిమాండ్ చేశారు.

మన వెలుగు
ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక
బుధవారం 21 ఆగస్టు 2024

# రుణమాఫీ చేయాలని మెట్ పల్లిలో రైతుల నిరసన

## - రోడ్లపై భారీగా నిలిచిన వాహనాలు



జగిత్యాల ప్రతినిధి, ( మన వెలుగు ) ఆగస్టు 20 :
రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా మెట్ పల్లి లో రైతులు మంగళవారం ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీని అర్హులైన అందరికి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మెట్ పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల రైతులు ధర్నాలో పాల్గొన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రుణమాఫీని ఇవ్వాలని నినాదాలు చేశారు. 2 గంటలపాటు జరిగిన ధర్నా వల్ల 5 కిలోమీటర్ల మేరా వాహనాలు రోడ్లపై నిలిచిపోయాయి. పోలీసులు చేరుకొని జిల్లా వ్యవసాయ అధికారులతో మాట్లాడించి ధర్నాను విరమించారు. ఈ సందర్భంగా రైతు ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ రాష్ట్రం ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ప్రకారం రుణమాఫీ చేయాలని కోరారు. రేషన్ కార్డ్ ప్రామాణికంగా తీసుకొకుండా అర్హులైన రైతులందరికీ భేషరతుగా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. పార్టీలకు అతీతంగా రైతులకు రావాల్సిన రుణమాఫీపై గ్రామ గ్రామాన నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైతు రుణమాఫీ కోసం 31 వేల కోట్లు కేటాయించామని చెప్పిన ప్రభుత్వం 17 వేల కోట్ల రూపాయలు రుణమాఫీ చేయడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం 2 లక్షల రుణమాఫీ చేయాలని, 2 లక్షలు దాటినా రుణాలపై రైతులు, బ్యాంకర్లము మాట్లాడుకుంటామని అది ప్రభుత్వానికి ఏమి సంబంధమని, ప్రభుత్వం చేయాల్సింది చేయాలని అన్నారు.

# ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగ అభ్యర్థులతో కలిసి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కని కలిసిన మంద కృష్ణ మాదిగ



ఆదిలాబాద్, ( మన వెలుగు ) ఆగస్టు 20 : ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం భర్తీ చేస్తున్న ఉద్యోగ నియామకాలలో రూల్ ఆఫ్ రిజర్వేషన్లు పాటించకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, నిరుద్యోగులకు అధికారులు చేస్తున్న అన్యాయం మీద ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.గ్రూప్ 1 గ్రూప్ 2 , గ్రూప్ 3 ఉద్యోగాల్లో ఎస్సీ,ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు అమలు చేయాలని, మెరిట్ సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులను ఓపెన్ కేటగిరీలోనే భర్తీ చేయలని, జీవో నంబర్ 55 ప్రకారమే గ్రూప్ -1కు సంబంధించిన 503 ఉద్యోగ నియామకాలు చేపట్టాలని,
మొదలగు సమస్యలను ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కదృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా ఈ సమస్యలను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ బీసీ నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.

# దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివి

## తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి



ఆదిలాబాద్, ( మన వెలుగు ) ఆగస్టు 20 : భారతదేశ సాంకేతిక పరిజ్ఞానానికి నాంది పలికి, అణగారిన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన గొప్ప నాయకుడు దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మంగళ వారం రాజీవ్ గాంధీ 80వ జయంతిని పురస్కరించుకుని ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోకి కేఆర్కె కాలనీలోని వృద్ధాశ్రమంలో రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి రాజీవ్ గాంధీ అమర్ రహే అంటూ నినాదాలు చేస్తూ వారి సేవలను గుర్తు చేసుకు న్నారు. అనంతరం వృద్ధులకు పండ్లను పంపిణీ చేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం దేశ ప్రజలు అనుభవిస్తున్న సాంకేతికకు రాజీవ్ గాంధీ ఆద్యుడని ఆయన పాలనలో ఎన్నో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు తీసుకువచ్చారని అన్నారు. అణగారిన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన గొప్ప నాయకుడు, యువతకు స్ఫూర్తి ప్రధాత ఆయన చూపిన మార్గంలో యువత పయనించి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మావల మండల్ మాజీ వైస్ ఎంపీపీ అట్ల గోవర్ధన్ రెడ్డి, మాజీ కో -ఆప్షన్ మెంబర్ రహీం ఖాన్, యువజన జిల్లా ఉపాధ్య క్షులు వేముల నాగరాజు, మావల మండల్ వర్కింగ్ ప్రెసి డెంట్ కుదురుపాక సురేష్, పార్టీ సీనియర్ నాయకులు నలిమేల నవీన్ రెడ్డి, కున్నిటి దామోదర్ రెడ్డి,కొరటి ప్రభాకర్, షాహిద్ భాయ్, రంజిత్ రెడ్డి, సంటెన్న తదితరులు పాల్గొన్నారు.

# లోతట్టు ప్రాంతాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## పలు కాలనీలో పర్యటించిన మేయర్ అజయ్ యాదవ్

బొడుప్పల్, ( మన వెలుగు ) ఆగస్టు 20 :
అకాల వర్షాలతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అత్యవసరమైతే తప్ప బయటకు రావోద్దని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ప్రజలను కోరారు. మంగళవారం తెల్లవారు జామున కురిసిన ఆకాల వర్షం కారణంగా నీట మునిగిన కాలనీలో కమీషనర్ రామలింగం,
కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాలనీ అసోసి యేషన్ ప్రతినిధులతో కలిసి పర్యటించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ ఆకాల వర్ణాలతో ప్రజలు అప్రమత్తం గా ఉండాలని ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలలో ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావోద్దని సూచించారు. 3 వ డివిజన్ వెంకటసాయి,ఎంఎల్ఆర్ కాలనీ,ఎస్బీఆర్ కాలనీ, అమ్మసాని వెంకట్ రెడ్డి కాలనీ,అంజయ్య ఎన్క్లేవ్,లక్ష్మారెడ్డి కాలనీల్లో స్థానిక కార్పొరేటర్లు కొత్త



చందర్ గౌడ్,కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, కొత్త దుర్గమ్మ, చీరాల నరసింహ లతో మేయర్ కాలనీలో పర్యటించి నిలిచిన వర్షం నీరు దిగువకు వెళ్ళేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అకాల వర్షాలు ఉన్న కారణంగా మానుసూన్ టీం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ



పర్యటనలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొత్త కిషోర్ గౌడ్, పులకండ్ల జంగారెడ్డి, కొత్త విక్రం గౌడ్,పోగుల దిలీప్ రెడ్డి, వెంకటసాయి నగర్ అసోసియేషన్ నాయకులు రాజిరెడ్డి,కార్పొరేషన్, డీఈఈలు, ఏఈఈలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గుండె పోటు తో మాజీ సర్పంచ్ మృతి

- అవినీతి రహిత రాజకీయ నేత
- లి ప్రజా ఉద్యమంలోనూ నారాయణ సేవలు మరువలేనివి
- లి ఊరికే ఉత్తముడు కొమ్మునేని నారాయణ

జగిత్యాల ప్రతినిధి, ( మన వెలుగు ) ఆగస్టు 20 :
జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం గోపులాపూర్ మాజీ సర్పంచ్ కొమ్మునేని నారాయణ (56) మంగళవారం గుండె పోటుతో మృతి చెందారు. ఆయన మాజీ సర్పంచ్ గా గతంలో ఐదేండ్లు గ్రామానికి సేవలు చేశారు. తాజాగా ఆయన భార్య సుశీల కూడా సర్పంచ్ గా ఐదేండ్లు గ్రామానికి సేవలు చేసి ప్రజల మెప్పు పొందారు. అంతకు పూర్వం వన సంరక్షణ సమితి చైర్మన్ గా కూడా కొమ్మునేని నారాయణ సేవలు అందించారు. ప్రజా ఉద్యమ కారునిగా కూడా నారాయణ సేవలు మరువలేమని గ్రామస్తులు, వివిధ ప్రాంతాల ఉద్యమ కారులు ఆయన సేవలను, త్యాగాలను జ్ఞాపకం చేసుకుంటున్నారు. ప్రజా ఉద్యమంలో అనేక సమస్యలు, ఇబ్బందులు, శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా కూడా ఆయన చాలా నష్టాలను - కష్టాలను అనుభవించారు. రైతు కుటుంబంలో జన్మించి



భూమినే నమ్ముకొని వ్యవసాయం చేసుకుంటూ బ్రతికిన నారాయణ కుటుంబం నలుగురి నోళ్ళలో నేడు మెదలక తప్పడం లేదు. మా ఊరికే ఉత్తముడు ఈ కొమ్ము నేని నారాయణ అంటూ శవ యాత్రలో గోపులాపూరు వాస్తవ్యులు ఆయన గురించి కొనియాడారు. అవినీతి రహిత రాజకీయ నేతగా కొమ్మునేని నారాయణ పేరుగాంచాడు. మంగళ వారం ఉదయం గోపులాపూర్ లో జరిగిన ఆయన అంత్య క్రియల్లో వివిధ శాఖల అధికారులు, తాజా - మాజీ ప్రజా ప్రతినిధులు,
వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు అభిమానులు, గ్రామస్తులు భారీ సంఖ్యలో శవ యాత్ర లో పాల్గొని కన్నీరు కార్చారు. నారాయణ సేవలు, ఆయన మంచి తనం గురించి ఒకరికొకరు వివరించుకున్నారు. నారాయణ పంచుకున్న గత జ్ఞాపకాలను అన్నింటినీ అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు, గ్రామస్తులు నెమరు వేసుకున్నారు.



కొన్ని దశాబ్దాలుగా రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల నాయకులతో సమన్వయం ఏర్పరచుకొని గ్రామానికి మరువ లేని సేవలు అందించిన నారాయణ మృతి పట్ల అందరూ విచారం వ్యక్తం చేశారు. ఇన్ని ఏండ్లుగా ప్రజా ప్రతినిధులుగా, నాయకునిగా కొనసాగి నిస్వార్థం తో ప్రజలకు సేవలు అందించి,
అవినీతి ఎరుగని ఆ కుటుంబానికి అండగా ఉండి అన్ని విధాలుగా సహకరించాలని, వారిని ఆదర్శంగా తీసుకోవాలని పలువురు ప్రముఖులు, విద్యావంతులు, గ్రామస్తులు ముచ్చటించుకున్నారు. మృతుడు కొమ్మునేని నారాయణ కు భార్య సుశీల, ఇద్దరు కుమారులు - కోడండ్లు, ఇద్దరు కూతుర్లు - అల్లుండ్లు ఉన్నారు. వారంతా కూడా వారి - వారి పనుల్లో లీనమ వుతూనే జ్ఞానవంతులుగా నారాయణ సేవల్లో కూడా పాలు పంచుకోవడం, ప్రజా సేవకు సహకరించడం హర్షణీయం.

# కరీంనగర్ పార్లమెంట్ ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడమే నా లక్ష్యం

- ఆ కసితోనే కష్టపడి పనిచేస్తున్నా
- నన్ను గెలిపించిన ప్రజలకు మేలు చేయడమే నా లక్ష్యం
- అధికారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు కళ్లు

కరీంనగర్, ( మన వెలుగు ) ఆగస్టు 20 : కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఉన్నా. నన్ను గెలిపించి ఈ స్థాయికి తీసుకొచ్చిన కరీంనగర్ పార్లమెంట్ ప్రజలకు పూర్తి స్తాయిలో మేలు చేయడమే నా లక్ష్యం. అందుకోసం నేను కసితో పనిచేస్తున్నా. మీ శాఖ తరపున కేంద్రం నుండి కరీంనగర్ కు ఏ ప్రాజెక్టు తీసుకురావచ్చు. ఏం చేస్తే ప్రజలకు మేలు జరుగుతుందనే అంశాలపై కచ్చితంగా ప్రతిపాదనలు రూపొందించండి. కేంద్రంలోని ఆయా శాఖల మంత్రులతో మాట్లాడి తీసుకొచ్చే బాధ్యత నాది. దయచేసి మీరంతా సహకరించండి.కరీంనగర్ జిల్లాలోని వివిధ శాఖాధిపతులతో జరిగిన ఇంటరాక్షన్ సమావేశంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చేసిన వ్యాఖ్యలివి. కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి బండి సంజయ్ కరీంనగర్ కలెక్టరేట్ కు విచ్చేశారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిసహా పలువురు అధికారులు బండి సంజయ్ కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వివిధ శాఖధిపతులతో ఏర్పాటు చేసిన ఇంటరాక్షన్ సమావేశానికి బండి సంజయ్ హాజరయ్యారు. శాఖల వారీగా కేంద్ర ప్రభుత్వ అందిస్తున్న భాగస్వామ్యం, నిధులు వివరాలతోపాటు కేంద్ర పథకాల అమలు తీరుపై వివరాలను అడిగి



తెలుసుకున్నారు. పరిశ్రమలు, స్మార్ట్ సిటీ వ్యవసాయం, పౌర సరఫరాలుబీ మహిళ, శిశు సంక్షేమంబీ వైద్య, ఆరోగ్యంబీ గ్రామీణ నీటి సరఫరా తదితర విభాగాల్లో కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్, రూరల్), ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్), ప్రధానమంత్రి ఉజ్వల యోజన, జీఎం-జీకేఏవై, పోషణ్ అభియాన్, ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన పథకల అములు పైన సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలను మంత్రికి తెలియజేయగా, ఆయా శాఖల జిల్లాస్థాయి అధికారులు గణాంకాలతో సహా వాటి ప్రగతిని వివరించారు.ముఖ్యంగా పీఎం స్వనిధి,, మధ్యాహ్నం భోజనం, పౌరసరఫరాలు, ఆయిల్ ఫాం, రోడ్ల నిర్మాణంపై పురోగతి వివరాలను కేంద్ర మంత్రి అధికారులను వివరించారు. ఆయా పథకాలు, అభివృద్ధి పనుల అమలులో ఎదురవుతున్న ఇబ్బంద దులు, కేంద్రం నుండి అందాల్సిన సహకారంపైనా అధికారులనుండి వివరాలు తెలుసుకున్నారు. పామాయిల్ తోటల పెంపకానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తోందని, రైతులకు కనీస మద్దతు ధర రూ.12 వేలు ఇస్తోందని, అయినప్పటికీ రైతులు ఆశించిన స్థాయిలో ముందుకు



రావడం లేదన్నారు. కనీస మద్దతు ధరను రూ.15 వేలుగా పెంచాలని రైతులు కోరుతున్న విషయాన్ని మంత్రికి వివరించారు. పంచాయతీల్లో బిల్లులు ఆగిపోవడానికి కారణాలేమిటని మంత్రి ఆరా తీశారు. కేంద్రం నుండి నిధుల విడుదలలో జాప్యముందా? రాష్ట్ర ప్రభుత్వం నిధులిస్తుందా? అని అడిగిన ప్రశ్నకు 'కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్దిక సంఘం నిధులను క్రమం తప్పకుండా ఇస్తోంది. అయితే రాష్ట్ర ప్రభుత్వమే గత రెండున్నరేళ్ల నుండి నిధులు మంజూరు చేయకపోవడంతో బిల్లులు ఆగిపోయాయి"అని అధికారులు బదులిచ్చారు. కరీంనగర్ జిల్లాలో ఎంఎస్ఎంఈ ఎక్స్ టెన్సన్ కౌంటర్ ను ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత ప్రజలకు మేలు జరుగుతుందని అధికారులు సూచించడంతో ఆ దిశగా తప్పకుండా క్రుషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కరీంనగర్ లో కేంద్ర నిధులతో సీఐటీడీ భవనాన్ని ఏర్పాటు చేశామని, అయితే రూ.6 కోట్ల విలువైన మిషన్ ను ఇంకా ఏర్పాటు చేయలేదని అధికారులు చెప్పడంతో 'కష్టపడి కేంద్రాన్ని ఒప్పించి యువతకు శిక్షణ ఇప్పించేందుకు సీఐటీడీ భవనాన్ని ఏర్పాటు చేసుకున్నం. మిషన్ లేకపోతే ఎలా? ఏ ఇన్నాళ్లు ఆ విషయం ఎందుకు చెప్పలేదు. ఇకపై శాఖల వారీగా ఏ ఇబ్బంది ఉన్నా నా ద్రుష్టికి తీసుకురండి అని పేర్కొన్నారు.

మన వెలుగు
ప్రతి వార్త ప్రజల వైపు   తెలుగు దినపత్రిక
బుధవారం 21 ఆగస్టు 2024

## సంపాదకీయం

### నినాదంగానే మిగిలిపోతున్న అభివృద్ధి !

విపక్షంలో ఉన్నప్పుడు కనిపించిన అనేకానేక సమస్యలను. .అధికారంలో ఉన్నప్పుడు విస్మరిస్తున్నారు. ప్రజలు, రైతులు, నిరుద్యోగులు తదితర సమస్యలు అధికారంలోకి వచ్చాక వారికి కనిపించడం లేదు. ఇందుకు మోడీ కూడా మినహాయింపు కాదు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉంటూ అనేక రకాలుగా యూపిఏ ప్రభుత్వాన్ని విమర్శించి, మన్మోమన్ సింగ్‌ను మౌనసింగ్‌గా అభివర్ణించిన మోడీ ఇప్పుడు ప్రధాన సమస్యలను పట్టించుకోవడం లేదు. ఇప్పటికే పదేళ్ల పుణ్యకాలం గడిచిపోయింది. 78వ స్వాతంత్ర్య దినోత్సవం జరుకున్నాం. ఇంకా రైతులు, నిరుద్యోగుల సమస్యలు రెట్టింపు అయ్యాయే తప్ప తగ్గలేదు.

మన నాయకులు కూడా నైతికంగా పతనమవుతూ వచ్చారు. అధికారమే పరమావధిగా రాజకీయాలు రాజ్యమేలుతున్నాయి. అధికారం కోసం సమాజాన్ని కులాలు, మతాల పేరిట ముక్కలు చెక్కలు చేశారు. తప్పుడు పనులు చేసే వారు కూడా కులాన్ని రక్షణ కవచంగా వాడుకోవడం మొదలెట్టారు. వజ్రోత్సవాల సందర్భంగా మన పతనాన్ని చూస్తే ఆవేదనే మిగులుతుంది. ధరలు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నా పట్టించుకోవడం లేదు.నివారణకు చర్యలు తీసుకోవడం లేదు. క్షేత్రస్థాయిలో చర్చించడం లేదు. పార్లమెంటులో చర్చించడం లేదు. అఖిలపక్షం ఏర్పాటు చేసి చర్చించడం లేదు. మోడీ పార్లమెంటులో కనిపించరు. ప్రజల్లోకి రారు. ప్రజలు తమస సమ్యలను ఎక్కడ చెప్పుకోవాలో తెలియడం లేదు. ప్రజల్లోకి వెళ్లి సమస్యలను ఆరా తీయడం లేదు. ఇలాగే పాలన కొనసాగిస్తే మరో 20 ఏళ్లయినా భారత్ బలపడదు. అత్యాచార ఘటనలు, పేపర్ లీకేజీలపై కఠిన చర్యలు తీసుకోవడం లేదు. పన్నులు వసూళ్లతో ప్రజలను పీల్చి పిప్పి చేయడం తప్ప మరో ధ్యాస బిజెపి పాలకులకు కనిపించడం లేదు. ఈ దశలో భారతదేశం స్వాతంత్య్రోత్సవాలను పురస్కరించుకుని 78 ఏళ్ళు అవుతున్న సందర్భంగా దేశ విదేశాల్లోనూ వేడుకలు అంబరాన్ని అంటాయి. ఊరూవాడా మువ్వన్నెల జెండా రెపరెప లాడింది. ప్రజలు తమ దేశభక్తిని మనసారా చాటారు. ఈ స్ఫూర్తిని ఇంకా ముందుకు తీసుకుని పోవాలని ప్రజలు మాత్రమే సంకల్పం ప్రకటించారు. పాలకులు ఇక తమ రాజకీయాలను పక్కన పెట్టి దేశంకోసం శ్రమించాల్సిన సమయమిది. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక, ఆర్థిక న్యాయానికి విలువనిచ్చే అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, పౌర గ్రూపులు స్వార్థపర రాజకీయశక్తులతో పోరాడేందుకు సమైక్యంగా కృషి చేయాలి. అప్పుడే పోరాట యోధులు సాధించి పెట్టిన స్వాతంత్ర్య లక్ష్యాలను ముందుకు తీసుకెళ్ళ గలుగుతాం. ఆధునిక కాలంలో ఒక స్వతంత్ర దేశం సాధించిన పురోగతిని అంచనా వేయడానికి 78 ఏళ్ల సుదీర్ఘ కాలం సరిగ్గా సరిపోతుంది. మనం సంబరంగా జరుపుకుంటున్న ఈ ఉత్సవాలను పునఃసమీక్షించు కుని ముందుకు సాగాల్సి ఉంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు పూర్తయినా ఇంకా దారిద్య్రం పోలేదు. పేదలు పేదలుగా ఉంటున్నారు. గృహవసతి అందని ద్రాక్షగా మారింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎంతో అభివృద్ధిని సాధించాం. ఆర్థికంగా కూడా పురోగమించాం. 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పుడు మన దేశ వార్షిక బడ్జెట్ 250 కోట్లు దాటలేదు. ఇందులో దాదాపు 30 కోట్ల ద్రవ్యలోటు ఉంది. ఇప్పుడు దేశ వార్షిక బడ్జెట్ దాదాపు 30 లక్షల కోట్ల వరకు ఉంది. వార్షిక ఆదాయం 170 కోట్ల వరకు మాత్రమే ఉన్నప్పటికీ నాటి పాలకులు ప్రభుత్వరంగ సంస్థలను, సాగునీటి ప్రాజెక్టులను చేపట్టారు. పంచవర్ష ప్రణాళికల ద్వారా వాటిని పూర్తి చేశారు. ఇప్పుడు ప్రభుత్వ ఆదాయం ఇబ్బడిముబ్బడి గా పెరిగినప్పటికీ దశాబ్దాల క్రితం ఏర్పాటైన ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముకుంటున్నాం. ఉపాధి ఉద్యోగ రంగాలను దెబ్బతీస్తున్నాం. దేశం అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోందని చెప్పుకొంటున్న పాలకులే పేదరికం పేరిట ఉచిత పథకాలకు తెర తీస్తున్నారు. మరోవైపు లక్షల కోట్ల కార్పోరేట్ రుణాలను మాఫీ చేస్తున్నాం.

ప్పుడు రాష్ట్రాల్లో గానీ, కేంద్రంలో గానీ అధికారంలో ఉన్నవారెవరూ 1947కి ముందు పుట్టినవాళ్లు కారు. నిరక్షరాస్యులైన ప్రజలతో నిండిన ఒక దేశంలో ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థను నిర్మించాలని భారతదేశంలో అధికారంలోకి వచ్చిన కొత్త పాలక వర్గాలు భావించాయి. రెండు శతాబ్దాల పాటు సాగిన వలస పాలనతో దేశం మొత్తంగా కుంగుబాటుకు గురైంది. అభివృద్ధి వెనుకపట్టు పట్టింది.

# కవితకు బెయిల్ ఇప్పిస్తున్న సీఎం రేవంత్ లాయర్

## కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు



కరీంనగర్, ( మన వెలుగు ) అగస్ 20 :
ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఐదు నెలలుగా తీహార్ జైలులో ఉన్న ఎమ్మెల్సీ కవిత బెయిల్ అంశం తెలంగాణ రాజకీయాల్లో కాక రేపుతోంది. కవితకు బెయిల్ వచ్చే అవకాశాలు ఉండటంతో.. ఆమె కేంద్రంగా విలీనంపై మాటల తూటాలు పేలుతున్నాయి. కూతురు కవితకు బెయిల్ కోసం బీజేపీ పెద్దలతో కేసీఆర్ ములాఖత్ అయ్యారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి కూడా పదేపదే ఇవే ఆరోపణలు చేస్తున్నారు. తాజాగా
కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు.లిక్కర్ కేసులో అరెస్టై జైల్లో ఉన్న కల్వకుంట్ల కవితకు కాంగ్రెస్ పార్టీయే బెయిల్ ఇప్పించేందుకు ప్రయత్నిస్తోందని బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ సింఘ్వీ యే కవితకు బెయిల్ ఇప్పించేందుకు కోర్టులో వాదనలు విన్పిస్తున్నారని చెప్పారు. అందుకు అనుగుణంగానే అభిషేక్ సింఘ్వీకి తెలంగాణ నుండి కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ వేయించారని తెలిపారు. ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలతో కేసీఆర్ మ్యాచ్ ఫిక్సింగ్ అయ్యార నడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలని సంజయ్ ప్రశ్నించారు. కేసీఆర్ చెబితేనే కాంగ్రెస్ పార్టీలో ఎంపీ సీట్లు, ప్రభుత్వంలో మంత్రి పదవులిస్తున్నారని తెలిపారు. ఈ విషయం తెలిసి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కేసీఆర్ ఫాంహౌజ్ కు క్యూ కడుతున్నారని వ్యాఖ్యనించారు.పదేపదే బీజేపీలో బీఆర్ఎస్ విలీనం చేసుకోబోతున్నారంటూ దుష్ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు బండారం బయటపడింద న్నారు బండి సంజయ్. కాంగ్రెస్ నేతలే కేసీఆర్ తో మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీయే లిక్కర్ కేసులో కవితకు బెయిల్ ఇప్పించేందుకు ప్రయత్నిస్తోందని అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ సింఘ్వీ కవిత బెయిల్ కోసం కోర్టులో వాదిస్తున్నారని తెలిపారు.పెద్ద వకీలు అయిన సింఘ్వీ తెలంగాణ నుండి కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థి అవుతున్నాడంటే తెలంగాణ ప్రయోజనాల కోసం కోర్టులో, పార్లమెంట్ లో గట్టిగ వాదిస్తడని అనుకున్నా. కానీ తీరా చూస్తే%ెూ% లిక్కర్ కేసులో అరెస్టై జైల్లో ఉన్న కల్వకుంట్ల కవిత కు బెయిల్ ఇవ్వాలని వాదిస్తున్నారని సంజయ్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మ్యాచ్ ఫిక్సింగ్ అయ్యాయనడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి? దీనిపై కాంగ్రెస్ పార్టీ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇన్నాళ్ళు కేసీఆర్ కుటుంబ అవినీతిని బట్టబయలు చేస్తాం%ెూ% జైలుకు పంపిస్తామని బీరాలు పలికిన కాంగ్రెస్ నేతలు ఆ కుటుం బాన్ని ఎందుకు జైలుకు పంపలేదని నిలదీశారు. ఎందుకంటే కాంగ్రెస్ తో మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నాయి కాబట్టి. అందుకే కాళేశ్వరం, డ్రగ్స్, మియాపూర్ భూములు, ఫోన్ ట్యాపింగ్ కేసులన్నీ అటకెక్కించారని ఆరోపించారు బండి సంజయ్. రెండు పార్టీలు ఒక్కటే. బీఆర్ఎస్ తో బీజేపీ పొత్తు కల్ల. బీఆర్ఎస్ అవినీతి, కుటుంబ పార్టీ. ఆ పార్టీతో పొత్తు ఉండదు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు అవినీతి, కుటుంబ పార్టీలే. కాబట్టి కాంగ్రెస్ లోనే బీఆర్ఎస్ విలీనం తధ్యమని తేల్చి చెప్పారు.

## పెండింగ్లో ఉన్న 12 వేల ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తులను 3 నెలల్లో పూర్తి చేయాలి

### మున్సిపల్ అధికారులు ఆదేశించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్, ( మన వెలుగు ) ఆగస్టు 20 : ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో గల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీ లన చేయుటకు నియమించిన రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులతో జిల్లా పాలనాధికారి రాజర్షి షా సమావేశం నిర్వహించి పెండింగ్ లో గల 12000 దరఖాస్తులను 3 నెలలో పూర్తి చేయాలని ఆదేశించారు ఇట్టి అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, పరిశీలన కొరకు వచ్చే అధికారులకు సహకరించ వలసిందిగా తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్ సంబధిత అధికారులు పాల్గొన్నారు.

## రైతులు ఎదుర్కొంటున్న సమస్యపై కలెక్టర్, ఎస్పీలను అఖిలపక్షం ఆధ్వర్యంలో కలిసిన మాజీ మంత్రి




ఆదిలాబాద్, ( మన వెలుగు ) ఆగస్టు 20 : ఆదిలాబాద్ జిల్లా అఖిలపక్షం ఆధ్వ ర్యంలో మాజీ మంత్రి జోగు రామన్న జిల్లా రైతు ఎదుర్కొంటున్న రుణమాఫీ సమస్యలపై జిల్లా కలెక్టర్ రాజర్షా షా, జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాలను అందజేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్పి తో పాటు జిల్లా కలెక్టర్ కు వివరించి రైతులకు సమస్యలు లేకుండా చూడా లని విజ్ఞప్తి చేశారు. గత కొంతకాలంగా రైతులు చేను పనులు మానేసి బ్యాంకుల చుట్టూ అన్న పానీయాలు దూరమై రుణమాఫీ కోసం నానా అవస్థలు పడుతున్నారని కలెక్టర్కు తెలియజేశారు. రైతులకు ఇబ్బందులు ఎదురై ఆందోళన కార్యక్రమా లతో రైతులు రైతు కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నాయన్నారు.కలెక్టర్ స్పందిస్తూ రుణమాఫీలో కొంతవరకు చిన్నపాటి లోపాలు తలెత్తాయని త్వరలో వాటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు..

ఈ కార్యక్రమంలోరైతు సంఘం అధ్యక్షులు బండి దత్తాత్రే.వెంకట్ నారాయణ. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, జగన్, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్. రైతు నాయకులు కొండ రమేష్.. లోకారి పోశెట్టి. మాజీ మార్కెట్ చైర్మన్ మెట్టు ప్రలాద్ యాసం నర్సింగ్.బట్టు సతీష్.తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

## జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర మంత్రి పొంగులేటి సుధాకర్ రెడ్డి



ఆదిలాబాద్, ( మన వెలుగు ) ఆగస్టు 20 :
రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపద్యంలో ప్రాణ ,ఆస్తి నష్టం జరగకుండా జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవిన్యూ, సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం అయన ఖమ్మం నుండి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా అధికారులతో భారీ వర్షాలు, ధరణి,నూతన రెవిన్యూ చట్టంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు రానున్న 5 రోజులపాటు రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని ,అందువల్ల జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండడంతో పాటు, ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని ,ముఖ్యంగా ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. వర్షాల పట్ల నిర్లక్ష్యంగా ఉండవద్దని ,ఎక్కడైనా సమస్య ఉన్నట్లయితే వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో రాష్ట్రస్థాయి అధికా రుల దృష్టికి తీసుకురావాలని ఆయన ఆదేశించారు. భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకుని పాఠశాల విద్యార్థులు ఇబ్బం దులు పడకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, స్థానిక పరిస్థి తుల ఆధారంగా పాఠశాలలకు సెలవు ప్రకటించడం లేదా ప్రత్యామ్నాయ మార్గాలు చేయాలని అన్నారు. ప్రస్తుత రెవెన్యూ చట్టంలో మార్పులతో తీసుకురానున్న కొత్త రెవిన్యూ చట్టంపై ఈనెల 23 ,24 తేదీలలో జిల్లా స్థాయిలో వర్క్ షాప్ నిర్వహించి మేధావులు, సీనియర్ సిటిజన్ల అభిప్రాయాలను తీసుకొని రాష్ట్ర స్థాయికి పంపించాలని ఆయన కోరారు. ధరణి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని, జిల్లా కలెక్టర్లు పెండింగ్లో ఉన్న అన్ని ధరణి సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తులను వేగవంతం చేయాలని,గతంలో ఏవైనా డాక్యుమెంట్లు అప్లోడ్ చేయనట్లయితే ఇప్పుడు అప్లోడ్ చేసేందుకు అవకాశం ఉన్నందున అలాంటి వాటిని గుర్తించి అప్లోడ్ చేయించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ రానున్న 5 రోజుల పాటు, భారీ వర్షాలు కురిసేందుకు ఆస్కారం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా సాగునీటి ట్యాంకులు , చెరువులు, కుంటల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని, వాగులు, వంకలు, కల్వర్టులు పొంగి ప్రవహిస్తున్న చోట ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని, అవసరమైతే ట్రాఫిక్ ను మళ్ళించాలని తెలిపారు.ఈ నెల 25 వరకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరిక జారీ చేసిందని అన్నారు. పరిస్థితులను బట్టి ఆయా జిల్లాలలో పాఠశాలల ను మూసి వేయడం లేదా నడిపించడం చేయాలని అన్నారు .రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ఆదేశాల మేరకు రానున్న కొత్త రెవిన్యూ చట్టంపై ఈ నెల 23 ,24 తేదీలలో వర్క్ షాప్ లు నిర్వహించాలని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న ధరణి దరఖాస్తులు అన్నింటిని ఒక కొలిక్కి తీసుకురావాలని, ఎక్కడైనా సందేహాలు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ ఇతర అధికారులు రాష్ట్రస్థాయి నుండి హాజరు కాగా, జిల్లా నుండి జిల్లా పాలనాధికారి రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామల దేవి, ట్రైనీ కలెక్టర్ అబిగ్యా న్ మాలవియ, ఆర్డీవో వినోద్ కుమార్, జివాకార్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ చౌహాన్, మున్సిపల్ కమిషనర్, జిల్లా అధికారులు, తదితరులు ఉన్నారు.